
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
శనివారం 15 జూన్ 2024

ఎరువుల కొరత లేకుండా చూడాలి : జేడీఏ

మంచాల, జూన్ 14 : ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని జేడీఏ గీతారెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మంచాల మండలంలో విత్తనాలు, ఎరువుల కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ లైసెన్సు కల్గిన డీలర్ల వద్దనే విత్తనాలు, ఎరువుల కొనుగోలు చేయాలన్నారు. లూజు విత్తనాలు కొనవద్ద న్నారు. విత్తనాల ప్యాకెట్లపై గుర్తింపు పొందిన కంపెనీ పేరు, బ్యాచ్ నెంబర్లను చూసుకోవా లన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జ్యోతిశ్రీ, ఏఈవో లింగస్వామి పాల్గొన్నారు.



- అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో జోరుగా పైరవీలు
- పార్టీ పెద్దలను కలుస్తున్న ఆశావహులు
- ఇప్పటికే తొలి విడతలో ముగ్గురికి దక్కిన పోస్టులు
- అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ త్యాగం చేసినవారికి ప్రాధాన్యం!

నామినేటెడ్ పోస్టులపై నజర్!

మాజీ ఎమ్మెల్యేలతో పాటు రేస్‌లో పలువురు

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పడంతో ఆశావహులంతా వాటిని సాధించే పనిలో పడ్డారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్లు, గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు త్యాగం చేసిన వారు తమకు తప్పకుండా పదవి దక్కుతుందన్న ఆశతో ఉన్నారు. మరి కొందరు సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీలో కీలక నేతలతో సన్నిహితంగా ఉన్న నాయకుల ద్వారా పదవులు పొందేలా చూసుకుంటున్నారు. ఇంకొందరు గతంలో తమకు నామినేటెడ్ పోస్టులు ఇస్తామని హామీ ఇచ్చారని, కాబట్టి తమకు తప్పకుండా పదవి దక్కుతుందన్న ధీమాతో ఉన్నారు. చివరకు ఈ పదవులు ఎవరికి దక్కుతాయో చూడాల్సిందే.

అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లను త్యాగం చేసిన వారికి ఇప్పటికే చైర్మన్ పోస్టులను కట్టబెట్టాలని యోచిస్తుండంతో సీఎం రేవంత్‌కు, అధిష్ఠానం పెద్దలకు సన్నిహితంగా ఉన్నవారితో కొందరు పైరవీలు ప్రారంభించారు.

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూన్ 14 : గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అవకాశాలు దక్కని ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలంతా ఇపుడు నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఆశలు పెట్టుకున్నారు. త్వరలో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఆ పోస్టుల కోసం క్యూ కడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో పదవుల కోసం వీరంతా తమ వంతు ప్రయత్నాలు మొదలు పెట్టారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ సర్కారు రావడంతో ప్రాధాన్యం కలిగిన పోస్టులు దక్కించుకోవాలని కొందరు నేతలు ఆరాటపడుతున్నారు. ఏళ్ల తరబడి పార్టీ బలోపేతం కోసం కష్టపడుతూ, పార్టీ కోసం టికెట్లను సైతం త్యాగం చేసిన కీలక నేతలు ప్రభుత్వంలోని వివిధ నామినేటెడ్ పోస్టులపై ఆశలు పెట్టుకున్నారు. వీటిని దక్కించుకునేందుకు సన్నిహిత మంత్రులు, ఏఐసీసీ, టీపీసీసీ పెద్దలతో పైరవీలు షురూ చేశారు. ఇప్పటికే జిల్లాకు మూడు పదవులు దక్కాయి. తాజాగా మరికొన్ని కార్పొరేషన్లకు, కమిషన్లకు చైర్మన్లను నియమించే అవకాశం ఉండటంతో సామాజిక సమీకరణాలు, స్థానిక అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈ పదవులను కట్టబెట్టే అవకాశం ఉండటంతో ఎవరికి వారు వ్యక్తిగత పైరవీలు మొదలు పెట్టారు. నామినేటెడ్ పోస్టులు ఆశిస్తున్న వారిలో మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు అనేక మంది ఉన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పలు కీలక కమిషన్లు, కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. ఆశావహులంతా సీఎంతో పాటు మంత్రులు పార్టీ పెద్దలను కలిసి విన్నపాలు చేసుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ 37 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించింది. వాటిలో ఇప్పటికే రంగారెడ్డి జిల్లాకు మూడు పదవులు దక్కాయి. వీటిలో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోస్టును మల్‌రెడ్డి రాంరెడ్డికి కేటాయించగా, పట్టణ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని, జిల్లా పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, గత అసెంబ్లీ ఎన్నికల్లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే సీటును త్యాగం చేసిన జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పదవిని కట్టబెట్టింది. అంతలోనే ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో వారెవరూ బాధ్యతలు స్వీకరించలేదు. త్వరలోనే వీరు బాధ్యతలు స్వీకరించే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎమ్మెల్యే స్థాయి నాయకులకు రాష్ట్రస్థాయి పదవులను ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఏళ్ల తరబడి పార్టీనే నమ్ముకుని చేస్తున్న వారితో పాటు గత అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లను త్యాగం చేసిన వారికి ఇప్పటికే చైర్మన్ పోస్టులను కట్టబెట్టాలని యోచిస్తుండంతో సీఎం రేవంత్‌కు, అధిష్ఠానం పెద్దలకు సన్నిహితంగా ఉన్నవారితో కొందరు పైరవీలు ప్రారంభించారు. వీరితో పాటు సీట్లను త్యాగం చేసిన వారిలోనూ ఈ పదవుల ఆశలు రేకెత్తిస్తున్నాయి. కొందరు నేతలు రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పోస్టులు కోరుకోగా ఇంకొందరు జిల్లాస్థాయి పోస్టులపై కన్నేశారు. జడ్పీ, మండల పరిషత్, మున్సిపల్ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో నామినేటెడ్ పదవులపై సీఎం ఫోకస్ పెట్టినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఆశావహుల్లో రేకెత్తిస్తున్న ఆశలు

రంగారెడ్డి జిల్లాలో మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి నామినేటెడ్ రేస్‌లో ఉన్నారు. జిల్లా నుంచి కొందరికి ఇప్పటికే అవకాశాలు దక్కాయి. ఇప్పటికే రాజేంద్రనగర్ అసెంబ్లీ స్థానం నుంచి ఓ నేతకు నామినేటెడ్ పదవి దక్కగా మరో ఇద్దరు సీనియర్ నేతలు సానెం శ్రీనివాస్‌గౌడ్, సామ రాజ్‌పాల్‌రెడ్డి నామినేటెడ్ పదవిని ఆశిస్తున్నారు. చేవెళ్ల అసెంబ్లీ స్థానం నుంచి ఈసారి ఎమ్మెల్యే టికెట్ ఆశించిన భంగపడిన నేతలు సున్నపు వసంతం, షాబాద్ దర్శన్‌కు పార్టీ అధిష్ఠానం సరైన న్యాయం చేస్తామని భరోసా ఇవ్వడంతో వారిద్దరూ నామినేటెడ్ పదవులపై ఆశలు పెంచుకున్నారు. అలాగే షాబాద్ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి సీఎంకు సన్నిహితుడు కావడంతో ఆయన తనకు తప్పకుండా పదవి వస్తుందన్న నమ్మకంతో ఉన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ధరణి కమిటీ సభ్యుడు ఎం.కోదండరెడ్డికి త్వరలో ఏర్పాటు కానున్న వ్యవసాయ కమిషన్‌లో కీలక పదవి వరించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి పార్టీ సీనియర్ నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, కొత్తకుర్మ శివకుమార్, కొంగరి విష్ణువర్ధన్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఓసారి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా పనిచేసిన కప్పాటి పాండురంగారెడ్డి మరోసారి చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. అలాగే కల్వకుర్తి నియోజకవర్గంలో ఆమనగల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ చైర్మన్, మైసిగండి మాజీ ఎంపీటీసీ అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు సూదిన రామిరెడ్డి, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, వై.నర్సింహ, వి.జంగయ్య నామినేటెడ్ పోస్టులు ఆశిస్తున్నారు. అలాగే మేడ్చల్ జిల్లాలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో పాటు సీనియర్ నేతలు హరివర్ధన్‌రెడ్డి, నక్కా ప్రభాకర్‌గౌడ్, నర్సిరెడ్డి భూపతిరెడ్డి రేస్‌లో ఉన్నారు.

వికారాబాద్ జిల్లాలో..

లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో నామినేటెడ్ పోస్టులపై అధికార పార్టీ నేతలు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, రాష్ట్ర ఫైనాన్స్ ప్లానింగ్ కమిషన్ సభ్యుడిగా రమేష్ మహరాజ్‌లకు ఇదివరకే పదవులు దక్కాయి. రాష్ట్రస్థాయి పదవులను మరికొందరు నాయకులు ఆశిస్తున్నారు. కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎనుముల తిరుపతిరెడ్డి, నందారం ప్రశాంత్, వికారాబాద్ నియోజకవర్గం నుంచి మునిసిపల్ మాజీ చైర్మన్ వి.సత్యనారాయణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, గుడిసె లక్ష్మణ్, ఎర్రవల్లి జాఫర్, మహిపాల్‌రెడ్డి తదితరులు నామినేటెడ్ పదవుల రేసులో ఉన్నారు. తాండూరు నియోజకవర్గం నుంచి మురళీకృష్ణగౌడ్, కరణం పురుషోత్తం రావు, సునీతా సంపత్, ధారాసింగ్, పరిగి నియోజకవర్గం నుంచి లాల్‌కృష్ణ ప్రసాద్, రాములు, కృష్ణారెడ్డి, ఆంజనేయులు, పరశురాంరెడ్డి, పాలాది శ్రీనివాస్, ఎర్రగడ్డపల్లి కృష్ణ, రామకృష్ణ, హన్మంత్ ముదిరాజ్ పోటీ పడుతున్నారు. ఇదిలా ఉంటే తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాల్‌రెడ్డి, బషీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మాధవరెడ్డి, కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అంజయ్య పేర్లను రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేసినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంకా నియామక ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది.

విద్యార్థుల అభ్యున్నతికి పెద్దపీట

- జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి
- హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీ
- వసతి గృహాల్లో అపరిశుభ్రతపై ఆగ్రహం
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన చైర్‌పర్సన్


హాస్టల్ విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్

కందుకూరు, జూన్ 14: విద్యార్థుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అనితారెడ్డి అన్నారు. కందుకూరు మండలంలోని పలు హాస్టళ్లను ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బైరాగిగూడలోని బీసీ గురుకుల హాస్టల్ అపరిశుభ్రంగా ఉండడంతో ప్రిన్సిపాల్ నాగభూషణచారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బైరాగిగూడ గ్రామ పంచాయతీలోని ఎంపీజేడబ్ల్యూ, గూడూరు గేటు వద్ద ఉన్న సోషల్ వెల్ఫేర్ బాలికల జూనియర్ కళాశాలను కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యారంగంలో రాణించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోందని చెప్పారు. పాఠశాలలు పునః ప్రారంభం అయిన నేపథ్యంలో హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు ఆమె తెలిపారు. వసతి గృహాల్లో డ్రైనేజీ, వంట గదులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు సమయానికి విధులకు హాజరు కావాలని, రోజువారీగా శానిటైజేషన్ సిబ్బంది పరిసరాలను, డైనింగ్ హాల్, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలన్నారు. బైరాగిగూడలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో గత విద్యాసంవత్సరం విద్యార్థులు అనారోగ్యానికి గురైనట్లు ఆమె గుర్తు చేశారు. ఈ విద్యా సంవత్సరంలో వసతిగృహాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని అనితారెడ్డి అన్నారు. లేకుంటే కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం తరగతి గదులు, వంటశాలలను, నిత్యావసర వస్తువులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. అనంతరం పీఆర్‌టీయూ నేతలు ఉపాధ్యాయుల బదిలీలపై ప్రభుత్వ చొరవ తీసుకోవాలని జడ్పీచైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, ఎంపీపీ మంద జ్యోతి, వైఎస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్ రెడ్డి, ఎంపీడీవో సరిత, మండల విద్యాధికారి మనోహర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సరికొండ మల్లేష్, నాయకులు పాండు, జగన్, శ్రీనునాయక్, వసతిగృహాల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

విద్యతో సమాజంలో గుర్తింపు

- అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్


విజేత పేరు చూపిస్తున్న ప్రతిమాసింగ్

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూన్ 14 : విద్యతో సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ప్రజ్ఞ హైస్కూల్, ఆమనట్లు ఫాతిమా హైస్కూల్, కొత్తూర్ నందు 3, 5, 8వ తరగతుల్లో చేరేందుకు గిరిజన బాలురు, బాలికల ఎంపిక కోసం లక్కీడ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిమాసింగ్ లక్కీడ్రాలో పేరు వచ్చిన చిన్నారులను అభినందించారు. కాగా, మూడో తరగతిలో 45సీట్లు ఉండగా.. 39 మంది దరఖాస్తులు చేసుకున్నారని, ఐదో తరగతిలో 22 సీట్లకు.. 58 మంది, ఎనిమిదో తరగతిలో 22సీట్లకు 40మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. 44మందిని లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశామన్నారు.

ఏడున్నరేళ్లవుతున్నా..!

- అందుబాటులోకి రాని డిగ్రీ కళాశాల భవనం
- నత్తనడకన సాగుతున్న పనులు
- అసౌకర్యాల నడుమ చదువులు
- ఈ యేడాదీ భవనం అందుబాటులోకి వచ్చేది అనుమానమే


అందుబాటులోకి రాని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం

ఇబ్రహీంపట్నం, జూన్ 14: ఈ విద్యా సంవత్సరంలో జూలై ఒకటి నుండి డిగ్రీ తరగతులు ప్రారంభం కాబోతున్నాయి. ఈ సారైనా నూతన భవనంలో చదువులు సాగుతాయా అని విద్యార్థులు, అధ్యాపకులు ఎదురు చూస్తున్నారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభించి ఏడున్నరేళ్లు అవుతున్నా దానిని ఇప్పటికీ అందుబాటులోకి తేలేకపోయారు. గత పాలకుల నిర్లక్ష్యం, కాంట్రాక్టరుకు సకాలంలో బిల్లులు మంజూరు చేయక పోవడంతోనే ఏళ్ల తరబడిగా జాప్యం జరిగిందన్న విమర్శలు తలెత్తుతున్నాయి. రూ. 2.25 కోట్ల అంచనాతో 2016 డిసెంబర్‌లో ఇబ్రహీంపట్నం టౌన్ సమీపంలోని వినోభానగర్‌లో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఈ భవనానికి శంకుస్థాపన చేశారు. మొదట్లో పనులు చకచకా కొనసాగినా ఆ తర్వాత నిలిచిపోయాయి. ప్రభుత్వం కాంట్రాక్టరుకు బిల్లులు విడుదల చేయక పోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఎట్టకేలకు ఈ భవనం పనులు పూర్తి కావచ్చాయి. పది రోజులుగా తలుపులు, కిటికీలు బిగించడంతో పాటు కలరింగ్ పనులు నడుస్తున్నాయి. అవి కూడా నాసిరకంగా నత్తనడకన సాగుతున్నాయి. భవనానికి ప్రధానంగా ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. మిగతా పనులు, ఫర్నిచర్‌కు రూ. 50లక్షల దాకా నిధులు కావాల్సి ఉందని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. అయితే, అసలు ఈ భవన నిర్మాణానికి నిధులు ఎవరిస్తారన్న ప్రశ్నకు సమాధానం చెప్పేవారే కరువయ్యారు. ఇక్కడ పరిస్థితిని బట్టి చూస్తే ఈ విద్యా సంవత్సరం కూడా కాలేజీ భవన నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వచ్చే పరిస్థితి లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2008 నుంచి అరకొర వసతుల మధ్యే..

2008 నుండి డిగ్రీ తరగతులు ఇబ్రహీంపట్నం టౌన్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంలో షిఫ్టు పద్ధతిన జరుగుతున్నాయి. ఉదయం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ తరగతులు, మధ్యాహ్నం ఒంటిగంట నుండి సాయంత్రం 6.00 గంటల వరకు డిగ్రీ తరగతులు నడుస్తున్నాయి. దీంతో ఉదయం పూట గ్రామాల్లో నుండి సకాలంలో తరగతులకు హాజరు కాలేక ఇటు ఇంటర్ విద్యార్థులు, మధ్యాహ్నం తరగతులతో డిగ్రీ విద్యార్థులు నష్టపోతున్నారు. డిగ్రీలో ఇక్కడ పలు కొత్త కోర్సులుండగా సుమారు 700 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. చాలీ చాలని గదుల్లో డిగ్రీ తరగతులు నిర్వహిస్తున్నారు. ల్యాబ్‌లు, లైబ్రరీకి గదులు లేక ఇరుకు గదిలో రెండు ల్యాబ్‌ల చొప్పున నడుపుతున్నారు. స్టాఫ్‌రూం కూడా లేదు. పరీక్షల నిర్వహణకు కష్టంగా ఉంది. ఏయేటికాయేడు నూతన భవనంలోకి డిగ్రీ కళాశాలను మార్చక పోతారా అని ఎదురు చూడడమే తప్ప కచ్చితమైన హామీ ఇచ్చేవారు లేరు. ఇప్పటికైనా త్వరితగతిన కళాశాల భవనం అందుబాటులోకి తేవాలని విద్యార్థులు కోరుతున్నారు.


కేటీఆర్ ఆవిష్కరించిన శిలాఫలకం

విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడారు



ఓ రకంగా చెప్పాలంటే గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను చిన్నచూపు చూసింది. ఏడున్నరేళ్లయినా ఈ భవనం పూర్తి కాలేదంటే ఎవరిని తప్పుబట్టాలి. ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు ఎక్కువగా ఉండే డిగ్రీ కళాశాల భవనం కోసం ఎదురు చూడాలా?. ఈ విషయంలో ప్రభుత్వ యంత్రాంగం స్పందించి వెంటనే భవనాన్ని అందుబాటులోకి తేవాలి. నూతన భవనం కోసం ఎదురుచూస్తున్నం

- గొరిగె బీరప్ప, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు

భవనం లేక ఇబ్బంది పడుతున్నం



ల్యాబ్‌ల నిర్వహణకు కష్టంగా ఉంది. పలు కొత్త కోర్సులలో సుమారు 700 మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. సరిపడా తరగతి గదులు, కనీస వసతులు లేవు. పరీక్షల నిర్వహణకూ ఇబ్బందులే. ఆట స్థలం కూడా లేదు. ఈ విద్యా సంవత్సరంలోనైనా కొత్త భవనంలోకి మార్చేందుకు చొరవ చూపాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కోరాం. వెంటనే పనులు పూర్తి చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

- డా.నాగోజి, అకడమిక్ కో ఆర్డినేటర్, ఇబ్రహీంపట్నం డిగ్రీ కళాశాల

రైతు సమస్యల సత్వర పరిష్కారానికి
వ్యవసాయ న్యాయ సలహా కేంద్రాలు

- సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

ఆమనగల్లు , జూన్ 14: రైతుల భూ వివాదాలు, న్యాయపరమైన సమస్యల సత్వర పరిష్కారానికి వ్యవసాయ న్యాయ సలహా కేంద్రాలు ఎంతగానో దోహద పడతాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి అన్నారు. రైతుల చెంతకే న్యాయ సేవలు తీసుకుపోయి వారి సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ న్యాయ సలహా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పా. ఆమనగల్లు పట్టణంలోని రైతు వేదికలో శుక్రవారం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ రైతులు వ్యవసాయానికి సంబంధించి ఎటువంటి న్యాయపరమైన సమస్యలు తలెత్తినా వాటిని ఈ వేదిక ద్వారా పరిష్కరించుకోవచ్చున ని తెలిపారు. రైతుల భూ వివాదాలు, ఇతర న్యాయ పరమైన సమస్యల పరిష్కారం కోసం ప్యారా లీగల్ వాలంటీర్లను నియమించినట్టు చెప్పారు. వ్యవసాయ, న్యాయ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా పనిచేసి రైతులకు న్యాయం జరిగేలా చేయడమే వ్యవసాయ న్యాయ సలహా కేంద్రాల ముఖ్య ఉద్దేశమన్నారు. సేవా కేంద్రంలో వారానికోసారి న్యాయవాది అందుబాటులో ఉంటారని, వ్యవసాయం, రైతులకు సంబంధించిన అన్ని సమస్యలపై ఈ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకుని వాటిని పరిష్కరించుకోవాలని శ్రీదేవి సూచించారు. రైతులు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పని సరిగా రశీదులు తీసుకోవాలని తెలిపారు. ఎవరైనా నకిలీ మందులు, విత్తనాలు విక్రయించినా, రైతులను మోసం చేసినా న్యాయ సలహా కేంద్రంలో ఫిర్యాదు చేయవచ్చునని జడ్జి తెలిపారు.. కార్యక్రమంలో జేడీఏ గీతారెడ్డి, మహేశ్వరం ఏడీఏ సుజాత, ఎంపీపీ అనిత విజయ్, వైస్ ఎంపీపీ జక్కు అనంత రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మండల వ్యవసాయాధికారి అరుణకుమారి, ఎంపీడీవో శ్రీకాంత్, ఎంపీవో శ్రీలత, మున్సిపల్ కమిషనర్ వసంత, డీటీ వినోద్, ఏఈవోలు రాణి, శివతేజ, సాయిరామ్, మీనాక్షి, ఎస్ఐ బాల్‌రామ్ నాయక్, వి.బాల్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

5,006 కిలోల గంజాయి, డ్రగ్స్ ధ్వంసం

- కమిషనరేట్ పరిధిలో గడిచిన మూడేళ్లలో పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న డ్రగ్స్
- నందిగామ మండలం ఈదులగూడలోని ఓ పరిశ్రమలో ధ్వంసం


ధ్వంసం చేయనున్న డ్రగ్స్‌తో డ్రగ్ డిస్పోజల్ కమిటీ అధికారులు

హైదరాబాద్ సిటీ/నందిగామ, జూన్ 14: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయి, డ్రగ్స్‌ను డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ అధికారులు శుక్రవారం రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం ఈదులగూడ శివారులోని బయో మెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో ధ్వంసం చేశారు. డ్రగ్ డిస్పోజబుల్ కమిటీ చైర్మన్ డీసీపీ నర్సింహ ఆధ్వర్యంలో సైబర్ క్రైం ఏసీపీ రవీందర్ రెడ్డి, సీసీఆర్ ఏసీపీ కళింగరావు, నార్కొటిక్స్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌తోపాటు సిబ్బంది డ్రగ్స్‌ను ధ్వంసం చేశారు. 30 పోలీస్‌స్టేషన్‌లలో మూడేళ్లలో 122 కేసుల్లో 5,006 కిలోల గంజాయి, హాష్ ఆయిల్, కొకైన్, ఛరస్, ఎక్స్‌టసీ, ఎల్ఎస్‌డీ, హెరాయిన్, ఓపీయం తదితర డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటిని శుక్రవారం ధ్వంసం చేశారు.

వర్షాకాలం ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ

తాండూరు రూరల్, జూన్ 14: వర్షాకాలం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని అల్లాపూర్, బెల్కటూర్, మల్కాపూర్, సంగెంక లాన్ గ్రామ శివారులోని వాగులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను దాటొద్దని సూచించారు. వర్షాలు కురిసినప్పుడు పొలాల్లో చెట్లకింద ఉండకూడదని సూచించారు. గ్రామాల్లో ప్రజలు శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఉండరాదన్నారు. సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. వర్షాలు కురుస్తున్నప్పుడు పొలాల్లో, చెట్లకింద ఉండరాదని తెలిపారు. అదేవిధంగా వాగుల్లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను జేసీబీలతో తొలగించాలని ఆయా గ్రామసిబ్బందికి సూచించారు. డీఎస్పీ వెంట కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి, బెల్కటూర్ మాజీ సర్పంచ్ వడ్డె మధు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు సందర్శించిన డీఎస్పీ

అనంతరం కర్ణాటక-తెలంగాణ సరిహద్దులోని కొత్లాపూర్ గ్రామశివారులో ఇటీవల ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును డీఎస్పీ బాలకృష్ణారెడ్డి సందర్శించారు. బక్రీద్ పండుగ సందర్భంగా కర్ణాటక రాష్ట్రం నుంచి గోవులను తరలించకుండా చెక్‌పోస్టులో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.



బెల్కటూర్ శివారులో వాగులు పరిశీలిస్తున్న డీఎస్పీ, ఎస్ఐ, సిబ్బంది

బక్రీద్ ప్రార్థన వేళలు

మేడ్చల్ టౌన్, జూన్ 14 : బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం నాడు మేడ్చల్‌లో నిర్వహించే ప్రార్థన సమయాన్ని ముస్లిం పెద్దలు శుక్రవారం ప్రకటించారు. మేడ్చల్ పరిధిలోలో మొత్తం ఐదు మసీదుల్లో బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాత జూమ్మా మసీదులో ఉదయం 8గంటలకు, చెక్‌పోస్టు ఏక్‌మినార్ మసీదులో ఉదయం 8:30గంటలకు, జిందాషామధార్ దర్గా మసీదులో 8:15గంటలకు, అత్వెల్లి ఈద్గాలో ఉదయం 8గంటలకు, మసీదులో ఉదయం 9:30గంటలకు ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.

వృథాగా పోతున్న సాగునీరు

● పట్టించుకోని నీటిపారుదల శాఖ అధికారులు



జుంటివాగు చెక్‌డ్యాం నుంచి వృథాగా పోతున్న వర్షం నీరు

తాండూరు రూరల్, జూన్ 14: మండలంలోని గోనూరు శివారులో గల జుంటివాగు చెక్ డ్యాం నుంచి సాగునీరు వృథాగా పారుతోంది. భారీ వర్షాలకు చెక్‌డ్యాంలో వర్షపు నీరు నిల్వ ఉండగా, అట్టి చెక్‌డ్యాం తూము షెటర్ లేకపోవడంతో నీరంతా కిందికి వృధా అవుతున్నది. మరోపక్క చెక్‌డ్యాం గోడ శిథిలావస్థకు చేరి కూలిపోయింది. దీంతో ఆ ప్రాతంలో నీరు నిలిచే అవకాశం లేదని రైతులు అంటున్నారు. సంబంధిత ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. మరోపక్క ఇట్టి నీరు వానాకాలం సాగుకు వాడుకునేందుకు వీల్లేకుండా పోతోందన్నారు.

ప్రాణం తీసిన పందెం

- గడ్డి మందు తాగితే రూ.లక్ష ఇస్తానని బెట్టుకాసిన స్నేహితులు
- అనాలోచితంగా గడ్డి మందు తాగిన మిత్రుడు
- చికిత్స పొందుతూ మృతి.. ఆలస్యంగా వెలుగులోకి..

శంకర్‌పల్లి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సరదాగా కాసిన పందెం ఓ వ్యక్తి ప్రాణం తీసింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాల్లోకి వెళితే.. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం చందిప్ప గ్రామానికి చెందిన వడ్డె సురేందర్(45) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అతడికి భార్య అనిత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అయితే, అదే గ్రామానికి చెందిన తన ఇద్దరు స్నేహితులు మల్లేషం, మాణిక్యంలతో కలిసి ఈనెల 4న సురేందర్ బయటకు వెళ్లాడు. కాసేపు సరదాగా మాట్లాడుకున్నారు. ఈక్రమంలో సురేందర్‌తో.. నువ్వు పురుగుల మందు తాగితే లక్ష రూపాయలు ఇస్తామని మల్లేషం, మాణిక్యంలు సరదాగా పందెం కాశారు. అయితే, సురేందర్ నిజంగానే పురుగుల మందు తాగాడు. వెంటనే మల్లేషం, మాణిక్యంలు ఉప్పు కలిపిన నీళ్లు కలిపి విరుగుళ్లు చేయించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. చికిత్స పొందుతూ సురేందర్ శుక్రవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సురేష్ మృతికి కారణమైన మల్లేషం, మాణిక్యంపై 306 సెక్షన్‌పై కేసు నమోదు చేశామని శంకర్‌పల్లి సీఐ హబీబుల్లాఖాన్ తెలిపారు.



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

మైనింగ్ పనులను నిలిపివేయాలి : రైతులు

తలకొండపల్లి, జూన్ 14: మండల పరిధిలోని చీపునుంతలలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న మైనింగ్ పనులను వెంటనే నిలిపివేయాలని గ్రామ రైతులు ఆర్డీవో సూరజ్‌కుమార్‌ను కోరారు. శుక్రవారం కందుకూరు ఆర్డీవో కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా తమ పొలాల్లో తవ్వకాలు జరుగుతున్నాయని, ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. మైనింగ్ పనుల మూలంగా పంట పొలాలు, బోరు బావులు, కాలుష్యంతో ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. మైనింగ్ పనులను నిలిపివేయాలని నిర్వాహకులను కోరుతుంటే.. బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు. పరమేశ్, భయమ్మ, నిర్మలమ్మ, బాలమ్మ, వీరప్ప, యాదయ్య, ఎల్లమ్మ, ఆశన్న తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్

నులిపురుగుల నివారణపై అవగాహన కలిగి ఉండాలి

షాబాద్, జూన్ 14 : ఈ నెల 20న నులిపురుగుల నివారణ దినాన్ని పకడ్బందీగా నిర్వహిద్దామని, ప్రతీ ఒక్కరు నులిపురుగుల నివారణపై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్ అన్నారు. శుక్రవారం షాబాద్‌లోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులు, వైద్యసిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ నులిపురుగుల దినం పురస్కరించుకొని.. 12 నెలల పిల్లలకు సగం మాత్రలను, 6 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్రను, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలు, విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు వేయాలన్నారు. ఈ మాత్రలు వేసుకుంటే రక్తహీనత, బుద్ధిమాంద్యం వంటి రోగాలబారిన పడరని, రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతంగా ఎదుగుతారన్నారు. ఎంపీడీవో అపర్ణ, ఎంఈవో శంకర్‌రాథోడ్, వైద్యాధికారులు వరలక్ష్మి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలి

తలకొండపల్లి, జూన్ 14: ఉపాధ్యాయులు విధిగా సమయ పాలన పాటించాలని ఎంఈవో సర్దార్ నాయక్ కోరారు. విధి నిర్వహణలో అలసత్వానికి తావుండకూడదని అన్నారు. తలకొండపల్లి మండలం మెదక్‌పల్లి, రాంపూర్, జంగారెడ్డి పల్లి, తలకొండపల్లి ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం ఎంఈవో సందర్శించారు. పాఠశాలల రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తలకొండపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రార్థనా సమయానికి రాని ఉపాధ్యాయురాలు సరోజకు ఒకపూట సెలవు వేయడం జరిగింది. అనంతరం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. సీఆర్పీలు ప్రతీరోజు ఒక పాఠశాలకు వెళ్లి ప్రార్థనకు హాజరుకావాలని సూచించారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో సర్దార్‌నాయక్

ఆరోగ్యవంతులు రక్తదానం చేయాలి

షాద్‌నగర్, జూన్ 14: ఆరోగ్యవంతులు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మితో కలసి వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఇతరుల ప్రాణాలు కాపాడవచ్చని, ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తే ఎలాంటి ప్రమాదం ఉండదన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు అరుణ, స్వర్ణకుమారి, శ్రీనివాసులు, శ్రీనివాస్‌రెడ్డి, మాధవి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఆరోగ్యవంతులు ఎవరైనా రక్తదానం చేయొచ్చు

వికారాబాద్, జూన్ 14 : రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేము కాబట్టి 18 సంవత్సరాల నుండి 55 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న ఆరోగ్య వంతులు ఎవరైనా రక్తాన్ని దానం చేయొచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పల్వన్ కుమార్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చని, ప్రతీఒక్కరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసినట్లయితే అనేక ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. వికారాబాద్ జనరల్ ఆస్పత్రి బ్లడ్‌బ్యాంకు సిబ్బంది 20మంది రక్తదాతల నుంచి రక్తం సేకరించారు. వారికి డీఎంహెచ్‌వో ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి రవీంద్రయాదవ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో జీవరాజు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్, మైనార్టీ చైర్మన్ సర్ఫరాజ్, నవాజ్, ఎస్సీసెల్ ప్రెసిడెంట్ యాదగిరి, కౌన్సిలర్ మోముల రాజు పాల్గొన్నారు.

అక్రమ సుద్దపై చర్యలేవి!

- సుద్ద నిల్వ పెట్టిన కంపెనీకి నోటీసు ఇవ్వని మైన్‌శాఖ
- దొంగరాయల్టీ సృష్టించి కేసు నీరుగార్చే యత్నం
- సీజ్ చేసిన సుద్ద తమ అధీనంలో వద్దన్న రెవెన్యూ శాఖ
- సేఫ్‌కస్టడీ బాధ్యత ఎవరిది?
- రంగంలో మైన్ డిప్యూటీ డైరెక్టర్

తాండూరు, జూన్ 14: పెద్దేముల్ మండలం మారేపల్లి గ్రామ సమీపంలో సుద్ద తవ్వి నిల్వ పెట్టింది అక్రమమేనని మైన్స్ శాఖ నిర్ధారించినప్పటికి సుద్దకు సంబంధించి నాలుగు రోజులైన ఇప్పటి వరకూ సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయలేదు. చర్యలు చేపట్టలేదు. అక్రమ సుద్ద తవ్వకాలపై 'సుద్దపై గద్దల్లా' అంటూ ఆంధ్రజ్యోతి కథనంపై అధికారులు స్పందించి రెవెన్యూ, మైన్‌శాఖ సంయుక్తంగా స్పందించి విచారణ జరిపి పంచనామా చేశారు. అక్రమంగా నిల్వ పెట్టిన సుద్ద 5వేల మెట్రిక్ టన్నుల వరకు ఉంటుందని మైన్స్ అధికారి నాగరాజు చెప్పారు. అయితే సుద్ద నిల్వలు కోఫియా మైనింగ్ లిమిటెడ్ కంపెనీ ఓనర్ చాకోకు చెందిన సర్వే నెంబర్ 11/అ/1లో నిల్వ పెట్టారు. అయితే ఇది తమకు తెలియకుండా తన స్థలంలో వేశారు అని కంపెనీ ఓనర్ పేర్కొంటున్నప్పటికీ సుద్ద నిల్వ చేసిన వారిపై కంపెనీ ఓనర్ ఫిర్యాదు చేయలేదు. అక్రమ సుద్ద నిల్వలపై సంబంధిత కంపెనీకి మైన్స్ శాఖ నాలుగు రోజులైనా నోటీసు ఇవ్వలేదు. దొంగ రాయల్టీ సృష్టించి నిల్వ చేసిన సుద్దను మాయం చేసే ప్రయత్నం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ పని చేసి బదిలీపై వెళ్లిన మైన్స్ ఏడీ ఒకరు కేసును తారుమారు చేసే యత్నం చేస్తున్నట్లు విమర్శలొస్తున్నాయి. పంచనామా చేసి నిల్వ ఉన్న సుద్దను తమ అధీనంలో పెట్టుకునేందుకు రెవెన్యూ శాఖ నిరాకరించింది. తమ వద్ద సిబ్బంది లేనందున అక్రమ సుద్దను తమ అధీనంలో పెట్టుకోలేమని చేతులెత్తేశారు. కలెక్టర్, ఆర్డీవోకు మైన్స్‌శాఖ ఈ విషయమై వివరించింది. దీంతో పోలీస్ శాఖకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. నిర్ణయం జాప్యం కారణంగా అక్రమ సుద్దను మాయం చేసే అవకాశం కూడా ఉంది. ఇదిలా ఉంటే మైన్స్ ఏడీ సెలవుపై వెళ్లడంతో మైన్స్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ నర్సింహారెడ్డి రంగంలో దిగి సుద్ద కస్టడీపై రెవెన్యూ శాఖకు అప్పగించేందుకు ఆర్డీవో, తహసీల్దార్‌లపై ఒత్తిడి పెంచారు.



మైన్స్, రెవెన్యూ శాఖలు గుర్తించిన అక్రమ సుద్ద నిల్వలు

ఫిట్‌నెస్ లేని పాఠశాలల బస్సులపై అధికారుల కొరడా

- ఇప్పటి వరకు 41 బస్సులు సీజ్
- పట్టుబడితే సీజ్ చేస్తాం: డీటీవో

మేడ్చల్ జూన్ 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నూతన విద్యా సంవత్సరం ఈ నెల 12 నుంచి పునఃప్రారంభమైంది. దాదాపు రెండు నెలల పాటు విద్యా సంస్థలు మూసి ఉన్నాయి. విద్యార్థులను తరలించే బస్సులు మూలకే పరిమితమయ్యాయి. వాటి సామర్థ్య పరీక్షల గడువు కూడా మే 15వ తేదీ వరకు ముగిసింది. ఒక వైపు విద్యాసంస్థలు తిరిగి ప్రారంభమైనా ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తికాలేదు. కొందరు యాజమాన్యాలు తమ వాహనాలకు సామర్థ్య పరీక్షలు చేయించడానికి అంతగా ఆసక్తి చూపడం లేదు.



స్కూల్ బస్సు తనిఖీ చేస్తున్న అధికారులు

నామమాత్రంగానే తనిఖీలు

ఏటా విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి ముందే బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించి ధ్రువీకరణ పత్రాలు పొందాల్సి ఉంటుంది. బీమా, కాలుష్యం తదితర పత్రాలు తప్పనిసరిగా వాహనంలో ఉండాలి. జిల్లా వ్యాప్తంగా 6,076 విద్యాసంస్థల బస్సులు ఉండగా ఇందులో 4941 వాహనాలకు మాత్రమే సామర్థ్య పరీక్షలకు పూర్తి కాగా 1135 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. ఇప్పటికే కొన్ని ప్రయివేటు పాఠశాలలు తరగతులు నిర్వహిస్తుండగా బుధవారం నుంచి మిగిలిన విద్యాసంస్థలు కూడా ప్రారంభమయ్యాయి. బస్సులను పూర్తిగా పరిశీలించకుండా నామమాత్రంగానే తనిఖీ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. చాలా బస్సుల్లో ప్రథమ చికిత్స బాక్సులు లేకపోవడం, ఇండికేటర్లు పగిలిపోయి ఉండటం కనిపిస్తోంది. అరిగిన టైర్లతో పాటు బస్సుపై పూర్తివివరాలు కనిపించడంలేదు. నిబంధనలు పాటించకుండా కొన్ని పాఠశాలల యాజమాన్యాలు తమ బస్సులు ఇష్టానుసారంగా నడిపిస్తున్నాయి.

41 బస్సులు సీజ్

ప్రాశాలలు ప్రారంభమైన నాటి నుంచి శుక్రవారం వరకు అధికారులు 41బస్సులను సీజ్ చేశారు. బుధవారం 15 బస్సులు, గురువారం 5, శుక్రవారం 21బస్సులను ఫిట్‌నెస్ లేకపో వడం, పన్నులు చెల్లించకపోవడం, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా తిరుగుతున్న వాటిపై దాడులు చేసి సీజ్ చేశారు.

పట్టుబడితే సీజ్



విద్యాసంస్థలకు సంబంధించి గడువు తీరిన ప్రతీ బస్సు ఫిట్‌నెస్ చేయించుకోవాల్సిన బాధ్యత ఆయా సంస్థలపై ఉంది. తనిఖీలు ముమ్మరం చేస్తాం. సామర్థ్య పరీక్షలు చేయించని బస్సుల వివరాలు సేకరించి నోటీసులు ఇస్తాం. పట్టుబడితే సీజ్ చేస్తాం.

రఘునందన్‌గౌడ్, డీటీవో, మేడ్చల్ జిల్లా



స్కూల్ బస్సుల ఫిట్నెస్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఫిట్నెస్ లేని బస్సులపై కేసు నమోదు



ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూన్ 14 : విద్యాసంస్థల బస్సులపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా రవాణాశాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఫిట్‌నెస్ లేని, పన్నులు చెల్లించని 34 బస్సులపై కేసులు నమోదు చేసినట్లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం నాలుగు బృందాలుగా ఏర్పడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ ఫిట్‌నెస్ లేని, 15 సంవత్సరాలు దాటిన విద్యాసంస్థల బస్సులు ఎట్టి పరిస్థితులలో రోడ్లపై తిరగరాదన్నారు. అనుభవం గల 60 ఏళ్లు మించని డ్రైవర్లను మాత్రమే నియమించుకోవాలని సూచించారు. ఈ తనిఖీలు కొనసాగుతాయని, ప్రతీ విద్యాసంస్థ బస్సు తప్పని సరిగా సంబంధిత రవాణా శాఖ కార్యాలయంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని తెలిపారు.ఈ తనిఖీల్లో రంగారెడ్డి, మేడ్చల్, ఉప్పల్ రవాణా శాఖ అధికారులు కిరణ్‌రెడ్డి, కృష్ణవేణి, సునీత, నవీన్, ఉపాసన, ప్రతాప్ ఎరాజా, త్రివేణి, శ్రీనివాస్, అనుష తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నీలం చెరువు నాలా దారి మళ్లింపు

మేడ్చల్ టౌన్, జూన్ 14: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని నీలం చెరువు నాలాను కొందరు ప్రైవేట్ వ్యక్తులు అక్రమంగా దారి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. చెరువులు, కుంటలు, వాగులు, వంతెనలను సంరక్షించాల్సిన సంబంధిత అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండటంతో కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు తమ భూమి మధ్య ఉన్న చెరువు నాలా దారి మళ్లిస్తున్నారన్న ఆరోపణలు వినబడుతున్నాయి. చెరువునీరు వ్యవసాయ పొలాలకు చేరదీయడానికి ఏర్పాటు చేసిన కాలువను ప్రస్తుతం పూర్తిగా అన్యాక్రాంతం చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. నీలం చెరువు పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ పొలాలు వెంచర్లుగా మారడంతో ఈ ప్రాంతంలో బహుళ అంతస్తుల నిర్మాణాలు, గేటెడ్ కమ్యూనిటీలు పెద్దఎత్తున వెలిశాయి. దీంతో గేటెడ్ కమ్యూనిటీల మధ్య నుంచి బహుళ అంతస్తుల సమీపం నుంచి కాలువను మళ్లించడానికి రియల్టర్లు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో అనుమతులు లేకుండానే దారి మళ్లింపు పనులు చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయం పట్ల ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకునే పాపాన పోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దొంగచాటుగా నాలా మళ్లింపు పనులు చేపడుతున్న వారిపై ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకుని చెరువు ఉనికిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



నీలం చెరువు నాలా

మిల్లింగ్ రైస్ సకాలంలో డెలివరీ చేయాలి

- అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, జూన్ 14: జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ సకాలంలో ప్రభుత్వానికి డెలివరీ చేయాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ మిల్లర్లకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను ప్రభుత్వానికి డెలివరీ చేయాలని, లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. రోజూ జిల్లా సివిల్ సప్లయ్ అధికారి, డీటీసీఎస్‌ల పరిధిలో ఉన్న రైస్‌మిల్లులను పర్యవేక్షించి అందరూ మిల్లర్లు సకాలంలో సీఎంఆర్‌ను డెలివరీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ మిల్లరు తాను పెట్టాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను తమ తమ మిల్లింగ్ కెపాసిటీ ప్రకారం వెంటనే ఎఫ్‌సీఐ/ సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌కు డెలివరీ చేయాలని మిల్లర్లకు ఆదేశించారు. ప్రతీ మిల్లరు గడువు తేదీలోగా తమ సీఎంఆర్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. మిల్లరు డిఫాల్టర్ రైస్ మిల్లర్లు అందరూ సీఎంఆర్‌ను గడువు తేదీ లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లయ్ రాజేశ్వర్, డీఎంసీఎస్ సుగునాబాయి, రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బలీశ్వర్ గుప్త, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

మిషన్ భగీరథ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- జడ్పీ డిప్యూటీ సీఈవో నీరజ

కీసర, జూన్ 14: మిషన్ భగీరథ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మేడ్చల్ జడ్పీ డిప్యూటీ సీఈవో నీరజా అన్నారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు 10 రోజుల పాటు ఇంటింటి సర్వే చేపట్టారు. సర్వేలో భాగంగా శుక్రవారం జడ్పీ డిప్యూటీ సీఈవో నీరజా మండలంలోని భోగారం గ్రామంలో పర్యటించారు. ఈమేరకు ఆమె క్షేత్రస్థాయిలో మిషన్ భగీరథ అమలు, ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఉందా..?లేదా..? పైప్ లైన్లు ఎలా ఉన్నాయి? ఏ మేరకు నల్లా ద్వారా నీరు ఇళ్లలోకి చేరుతున్నాయి. ప్రజలు ఏమేరకు నీటిని వినియోగించుకుంటున్నారు? అనే విషయాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వినియోగదారుల వివరాలు యాప్ ద్వారా సక్రమంగా నివేదికను ప్రభుత్వానికి అందజేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని ఆమె అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గీత పాల్గొన్నారు.



మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై సర్వే చేస్తున్న ఎంపీడీవో

దోమ: ఇంటింటికీ తిరిగి మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై నిర్వహిస్తున్న సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో మహేశ్‌బాబు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం మిషన్ భగీరథ కుళాయి కనెక్షన్లను పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వీవోఏలతో కలిసి సర్వే చేయించారు. ప్రతీ గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు, వీవోఏలు సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఓఏలు భాగ్యలక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై సర్వే నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం మిషన్ భగీరథ తాగునీరు సక్రమంగా వస్తుందా, లేదా అని ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ కుళాయి కనెక్షన్లను పరిశీలించి ఫొటోలు తీస్తున్నారు. కుటుంబ సభ్యుల వివరాలు, కులం, ఫోన్, ఆధార్ నెంబర్ సేకరిస్తున్నారు. ఈ సర్వే పదిరోజుల పాటు కొనసాగుతుందని పంచాయతీ కార్యదర్శి నర్సింహులు తెలిపారు.



భోగారంలో ఇంటింటి సర్వేలో పాల్గొన్న జడ్పీ డిప్యూటీ సీఈవో నీరజా

నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలి

- ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిరసన
- ప్రధాన రహదారులపై ధర్నా, రాస్తారోకో

ఆమనగల్లు, జూన్ 14: నీట్-2024 పరీక్షలో జరిగిన అవకతవకలపై కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు పర్యవేక్షణలో సమగ్ర విచారణ జరిపించాలని ఎన్ఎస్‌యూఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎండీ ఫరీద్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను రద్దుచేసి తిరిగి నిర్వహించాలని కోరారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలను నిరసిస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పేపర్ లీకులు, రిగ్గింగుల ద్వారా మోదీ సర్కార్ యువత భవిష్యత్తును నాశనం చేసిందని మండిపడ్డారు. సీబీఐతో సమగ్ర దర్యాప్తు జరిపించి విద్యార్థులకు న్యాయం చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు మహేశ్, అబ్దుల్, రాహుల్, యూత్ కాంగ్రెస్ నాయకులు కృష్ణ నాయక్, అలీం, నాజర్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించి విద్యార్థులను న్యాయం చేయాలని కోరుతూ ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కడ్తాల మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. ఎన్ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు షాబోద్దీన్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాలశీతలీకరణ కేంద్రం ఎదుట హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపైబైటాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. క్యామ రాజేశ్, భానుకిరణ్, పవన్‌కళ్యాణ్, బోసు రవి, ఇమ్రాన్ బాబా, తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం : ఎన్డీఏ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు

తలకొండపల్లి : నీట్ పరీక్షను రద్దుచేసి తిరిగి నిర్వహించాలని ఎన్ఎస్‌యూఐ, కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఎన్ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు రమేశ్‌నాయక్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి బీజేపీ, మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డీసీసీ కార్యదర్శి రవీందర్ యాదవ్, కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి అజీం, నాయకులు తదితరులున్నారు.



తలకొండపల్లి : కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

ఇబ్రహీంపట్నం : నీట్ పరీక్షను రద్దుచేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ అధ్యక్షుడు నందకిషోర్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం ఇబ్రహీంపట్నంలో నిరసన తెలిపి ఎన్డీఏ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు ఆయాన్, ప్రభాస్, అజయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని, వెంటనే రద్దు చేసి తిరిగి నిర్వహించాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి తల్లోజు వినోద్‌చారి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆ సంఘం నేతలతో కలిసి హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి పార్టీల పొత్తులపై ఉన్న శ్రద్ధ, విద్యార్థుల భవిష్యత్తుపై లేదన్నారు. నాయకులు ప్రభాకర్, రాజ్‌కుమార్, నయీం, ప్రవీణ్ ముదిరాజ్, నాగరాజు, రవి, నవీన్‌ముదిరాజ్, జాహంగీర్, తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న తల్లోజు వినోద్‌చారి, తదితరులు

విద్యాభివృద్ధికి పెద్దపీట

- ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, ప్రకాశ్‌గౌడ్
- విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం
- యూనిఫాం, పాఠ్యపుస్తకాల పంపిణీ



కొత్తూర్ : చిన్నారులచే అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్, జూన్ 14: విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బడిబాటలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో సాముహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో చిన్నారులకు అక్షరాలు పెట్టించారు. విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్, తదితరులున్నారు. శేరిగూబద్రాయపల్లి ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమానికి ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. మాజీ సర్పంచ్ ప్రభాకర్ తదితరులున్నారు.

శంషాబాద్ : హుడాకాలనీ ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ హాజరయ్యారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డితో కలిసి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. వైస్ ఛైర్మన్ బండి గోపాల్‌యాదవ్, కౌన్సిలర్లు తదితరులున్నారు.

కందుకూరు : విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత గురువులపైనే ఉంటుందని కొత్తూరు ఎంపీటీసీ జ్యోతి అన్నారు. కొత్తగూడ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం ఉమేష్‌రావు ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అంజయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మన్ వాణిరాంచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం : విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న ఎంపీపీ కృపేష్

మహేశ్వరం : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మహేశ్వరం ఎంపీపీ ఆర్. సునిత అంద్యానాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, మండల విద్యాధికారి కృష్ణ, ఎంపీడీవో శైలజారెడ్డి, సీడీపీవో షబానా, ఎంపీటీసీ పోతర్ల సుదర్శన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : పాఠశాలల బలోపేతం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ కృపేష్ అన్నారు. పోచారం-రాంరెడ్డిగూడ ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేశారు. ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, పిల్లలను ఈ బడుల్లోనే చేర్పించాలన్నారు. ఎంఈవో వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మంచాల : చదువుతోనే జీవితాల్లో వెలుగులు నింపబడతాయని జెడ్పీటీసీ నిత్య నిరంజన్‌రెడ్డి అన్నారు. మంచాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. నోడల్ అధికారి రాందాస్, ఈవోపీఆర్డీ తేజ్‌సింగ్, మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి, కార్యదర్శి రాజ్‌కుమార్, హెచ్‌ఎం నారాయణరెడ్డి, ఝాన్సీ, సుగంధ, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : చదువుతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని జడ్పీటీసీ విశాలశ్రవణ్‌రెడ్డి అన్నారు. పాపిరెడ్డిగూడ ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాసం నిర్వహించారు. ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంఈవో మనోహర్, ఉపాధ్యాయులు జి.మాధవి, అరుణకుమారి, స్వప్న, కె.శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



శంషాబాద్ : సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

తలకొండపల్లి : మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల ఛైర్మన్ పెరుమాండ్ల లలితమ్మ ర్యాలీ ప్రారంభించారు. అనంతరం జడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. హెచ్‌ఎం ఝాన్సీ, సీసీలు రాములు, నర్సింహ, చెన్నమ్మ, మానస, సౌమ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చౌదరిగూడ : విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ భూపాలచారి అన్నారు. పెద్ద ఎల్కిచర్ల జడ్పీహెచ్‌ఎస్ జీహెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంకటరెడ్డికి ఉపాధ్యాయులు, గ్రామస్తులు స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, రూపారాణి, శంకర్, పద్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొందుర్గు : విద్యార్థులు ఇష్టపడి చదవాలని చెరుకుపల్లికి చెందిన అడ్వొకేట్ నరేంద్రనాథ్ అన్నారు. చెర్కుపల్లి ప్రాథమిక పాఠశాల నుంచి వివిధ గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించిన విద్యార్థులకు శుక్రవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం శివారెడ్డి మాట్లాడుతూ 5వ తరగతిలో గురుకులాల్లో సీట్ల కోసం పాఠశాల నుంచి 23మంది విద్యార్థులు అర్హత పరీక్ష రాయగా.. 21మంది వివిధ గురుకులాల్లో సీట్లు సాధించారని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. అంగన్‌వాడి కేంద్రం నుంచి 12 మంది విద్యార్థులు పాఠశాలలో చేరగా అక్షరాభ్యాసం నిర్వహించారు. ఉపాధ్యాయుడు మల్లిఖార్జున్, విద్యావాలంటీర్ స్వప్న, మాజీ సర్పంచ్ కృష్ణవేణి ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల : తంగడ్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశం పొందిన పలువురు విద్యార్థులకు హెచ్‌ఎం గోపాల్, విద్యాకమిటీ ఛైర్మన్ వెంకటేశ్‌ల ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

షాబాద్ : అప్పులు తెచ్చి పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చదివించడం కన్నా.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమమైన చదువులు అందించవచ్చునని ఎంపీటీసీ చెన్నయ్య అన్నారు. సీతారాంపూర్‌లో బడిబాట కార్యక్రమంలో భాగంగా అక్యరాభ్యాసం చేయించారు. నోడల్ ఆఫీసర్ లక్ష్మణ్, ఉపాధ్యాయులు విష్ణువర్ధన్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శి మల్లేష్, అంగన్‌వాడీ టీచర్ మీన, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యాచారం : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఎంపీపీ సుకన్య యూనిఫాం పంపిణీ చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ప్రత్యేకాధికారి పాండురంగారెడ్డి తదితరులున్నారు.

షాద్‌నగర్‌రూరల్ : చదువుతోనే మనిషికి ఉన్నతమైన భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం కాశిరెడ్డిగూడలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి, ఎంఈవో శంకర్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కుటుంబ కలహాలతో భర్తపై భార్య, కుమారుడు దాడి

- చికిత్స పొందుతూ మృతి

తలకొండపల్లి, జూన్ 14: కుటుంబ కలహాలు ఓ వ్యక్తి హత్యకు దారితీశాయి. మండలంలోని తుమ్మలకుంట తండాలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆమనగల్లు సీఐ ప్రమోద్ కుమార్ తెలిపిన వివరాల మేరకు తలకొండపల్లి మండలం తుమ్మల కుంట తండాకుచెందిన మూడావత్ పాండుతో అతడి భార్య శాంతి, కుమారుడు శ్రీహరిలు కుటుంబ విషయంలో కొంతకాలంగా గొడవపడుతూ వస్తున్నారు. ఈనెల 12న ఇంట్లో మరోసారి పెద్ద గొడవ జరిగింది. దాంతో పాండు(45)పై శాంతి, శ్రీహరిలు కర్రలతో విచక్షణా రహితంగా దాడిచేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న పాండును హైదరాబాద్‌లోని రెండు ప్రైవేట్ ఆసుపత్రులకు.. పరిస్థితి విషమించడంతో ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందినట్లు సీఐ తెలిపారు. మృతుడు పాండు సోదరుడు రాముడు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఆవు, మేక మృత్యువాత

కేశంపేట/షాబాద్, జూన్ 14: మండల పరిధిలోని సంతాపూర్‌లో గురువారం సాయంత్రం గ్రామస్తుడు కుమ్మరి యాదయ్యకు చెందిన పాడిఆవును మేత మేసేందుకు పొలంలో వదిలాడు. అయితే, ఇటీవల విద్యుత్ వైరు తెగిపడటంతో మేతకు వెళ్లిన ఆవు తగిలి షాక్‌కు గురై మృతిచెందింది. ఆవు విలువ దాదాపు రూ.లక్ష ఉంటుందని రైతు తెలిపాడు. శుక్రవారం పశుసంవర్ధక శాఖ అధికారి పైలెట్ పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు. షాబాద్ మండలం మన్మర్రిలో గ్రామానికి చెందిన శీల నర్సింహులు మేక ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా విద్యుత్ వైరు తగిలి మృతిచెందింది.

4 కిలోల గంజాయి పట్టివేత

శంకర్‌పల్లి, జూన్ 14: గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మోకిల పోలీసులు శుక్రవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేస్తుండగా.. బైక్‌పై ఒడిషాకు చెందిన బాబు హల్దార్, తుకాచంద్ పొదర్‌లను పోలీసులు అనుమానం వచ్చి తనిఖీ చేశారు. ఈమేరకు వారి నుంచి 4 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మోకిల సీఐ వీరబాబు తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం

కొత్తూర్/కడ్తాల్/షాద్‌నగర్ రూరల్, జూన్ 14: కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెంజర్ల గ్రామానికి చెందిన మౌనిక అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తెలిపారు. గురువారం ఇంటినుంచి బయటకు వెళ్లిన మౌనిక రాత్రివరకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆచూకీ కోసం ఆరా తీసినా ఫలితం లేకపోయింది. మౌనిక తండ్రి భీమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శుక్రవారం ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 9440795743 నెంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు. కడ్తాల మండల కేంద్రానికి చెందిన కేశమోని రాజు అదృశ్యమైనట్లు ఆయన భార్య మీనా పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ శివప్రసాద్ కథనం మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం అజిలాపురం గ్రామానికి చెందిన కేశమోని రాజు హయత్‌నగర్‌కు చెందిన తరండ్ల మీనా మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. కొన్ని రోజుల నుంచి కడ్తాలలో ఇల్లు అద్దెకు తీసుకొని నివాసముంటూ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 9న రాత్రి దుకాణం వెళ్లి వస్తానని రాజు బయటకు వెళ్లాడు. ఇంటికి రాకపోయే సరికి మీనా చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. శుక్రవారం కడ్తాల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. షాద్‌నగర్ పట్టణంలోని సాంబశివ కాలనీలో నివాసముండే జర్పుల అంబి అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌లింగం తెలిపారు. ఈనెల 8న ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదని, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియలేదన్నారు. ఆమె భర్త రవినాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 9849163374 నెంబర్‌కు సమాచారమివ్వాలన్నారు.

పాడి రైతులను ఆదుకోవాలి

- పాల బకాయిలు, బిల్లులు వెంటనే చెల్లించాలి
- పాలసేకరణ కేంద్రాల అధ్యక్షుల వినతి



కడ్తాల్ : ఎంపీ మల్లు రవికి వినతి పత్రం అందజేస్తున్న పాలసేకరణ కేంద్రాల అధ్యక్షులు

కడ్తాల్, జూన్ 14: పెండింగ్ పాల బిల్లులను వెంటనే చెల్లించి పాడి రైతులను ఆదుకోవాలని విజయ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల అధ్యక్షులు ప్రభుత్వాన్ని కోరారు. పాడి పరిశ్రమ సహకార సమాఖ్య ద్వారా రావాల్సిన బకాయిలను వెంటే ఇప్పించి పాడిరైతులను ఆదుకోవాలని కోరారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కడ్తాల పాల శీతలీకరణ కేంద్రం పరిధిలోని విజయ పాల సేకరణ కేంద్రాల అధ్యక్షులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఏప్రిల్ 16 నుంచి నేటివరకు నాలుగు బిల్లులు రావాల్సి ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు. గత కొన్ని నెలల కాలంగా పాల బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతూ వస్తుందని తెలిపారు. సకాంలో బిల్లులు అందని కారణంగా పాడి ఆవులకు దాణా కొనుగోలుకు చేస్తున్న అప్పులు పేరుకుపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని మల్లు రవి దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎంపీ పాలబిల్లుల బకాయిల చెల్లింపు గురించి ఎండీ చిట్టెం లక్ష్మీకి ఫోన్‌లో తెలిపినట్లు పాలసేకరణ కేంద్రాల అధ్యక్షులు తెలిపారు. రాష్ట్రం మొత్తం ఈ సమస్య ఉందని ఎండీ తెలుపగా విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోతామని మల్లు రవి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సమాఖ్య జనరల్ మేనేజర్ మల్లయ్యకు బకాయిల చెల్లింపుపై వినతిపత్రం అందజేశారు. పాలసేకరణ కేంద్రాల అధ్యక్షులు చేగూరి వెంకటేశ్, బీచ్యనాయక్, రవీందర్ రెడ్డి, రంగయ్య, శ్రీకాంత్‌రెడ్డి, నర్సింహరెడ్డి, పలువురు పాడి రైతులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ : నాలుగు నెలలుగా పాడి రైతులకు పాల బిల్లులు రావడం లేదంటూ షాద్‌నగర్ పట్టణంలోని విజయపాల కేంద్రం వద్ద రైతులు ధర్నాకు దిగారు. వారు మాట్లాడుతూ నాలుగు నెలలుగా పాల బిల్లులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు రాకపోతే పశువులకు దాణా ఎలా కొనుగోలు చేయాలని, కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని వాపోయారు. బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నా సమాచారాన్ని తెలుసుకున్న పాడి పరిశ్రమ డిప్యూటీ డైరెక్టర్ శివలాకర్ యాదవ్ వెంటనే స్పందించి పాడి రైతులతో మాట్లాడారు. రైతులకు బిల్లులు ఇవ్వకపోవడం వాస్తవమే కానీ.. పాలు అమ్మడానికి చాలా ఇబ్బందిగా ఉందని వివరించారు. వారంలోపు రైతులకు అందాల్సిన పెండింగ్ బిల్లులను చెల్లిస్తామని తెలిపారు.



షాద్‌నగర్ : ధర్నా చేస్తున్న పాడి రైతులు



భక్తులనుద్దేశించి ఉపదేశమిస్తున్న శివానంద స్వామి

భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్రనామ యజ్ఞం

ఆమనగల్లు, జూన్ 14: ఆమనగల్లు పట్టణంలోని సద్గురు శ్రీ నిత్య సుద్దానందస్వామి క్షేత్రం, శ్రీ రామ దూత ఆశ్రమంలో శుక్రవారం 60వ విష్ణు సహస్ర నామ యజ్ఞం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ నిత్యశుద్ధానందస్వామి 3వ పుణ్యారాధన కార్యక్రమంలో భాగంగా ఆశ్రమ సంస్థాపకులు శ్రీ శివానంద స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన యజ్ఞం, భగద్గీత పారాయణం కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. పీఠాధిపతులు శ్రీ శంకరానంద గిరి స్వామి, శ్రీ లక్ష్మణ నందగిరి స్వామి, శ్రీమల్లిఖార్జున నంద స్వామిజీలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. శ్రీ నిత్యశుద్ధానంద స్వామి ఆరాధన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఠాధిపతులు, స్వామిజీలు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ దైవ చింతనతో ముందుకు సాగే వారు ఆనందమయ జీవితాన్ని పొందుతారన్నారు. దైవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజ శాంతి స్థాపనకు దోహద పడుతాయన్నారు. దైవ కార్యక్రమాలలో ప్రతీఒక్కరు పాలు పంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నటరాజ్ యాదయ్య, మాండెం చంద్రశేఖర్, వీరబొమ్మ రామ్మోహన్, ఆకుతోట శ్రీనివాస్, సత్యనారాయణ, గుర్రం సురేశ్, బికుమాండ్ల బుచ్చయ్య, నారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ కార్పొరేషన్ రుణాలు అందించాలి



వినతిపత్రం ఇస్తున్న వెంకటేశ్ తదితరులు

కడ్తాల్, జూన్ 14: రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి మైనార్టీ కార్పొరేషన్ ద్వారా కేటాయిస్తున్న నిధులు డీసీసీబీ బ్యాంకులు, పీఏసీఎస్ ల ద్వారా అందించాలని డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఈ మేరకు రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్‌ను హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. డీసీసీబీ, పీఏసీఎస్‌ల ద్వారా రుణాల అందజేతతో సహకార రంగం మరింత బలోపేతం కావడానికి అవకాశం ఉంటుందని వెంకటేశ్ తెలిపారు. తద్వారా రుణాల సద్వినియోగం, రికవరి కూడా సునాయాసంగా జరుగుతుందని పేర్కొన్నారు. మైనార్టీల సంక్షేమానికి కార్పొరేషన్ ద్వారా కేటాయించే ఏ నిధులైనా డీసీసీబీ బ్యాంక్ ద్వారా లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని కొత్వాల్‌కు విజ్ఞప్తి చేశారు. అందుకు ఒబెదుల్లా కొత్వాల్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని తెలిపినట్లు వెంకటేశ్ పేర్కొన్నారు. మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన వారిలో డీసీసీబీ డైరెక్టర్లు విష్ణువర్ధన్ రెడ్డి, రంగారెడ్డి, తదితరులు ఉన్నారు.

ఆలయ భూమిని రక్షించాలి

చౌదరిగూడ, జూన్ 14 : దేవాలయం చుట్టూ ఉన్న భూమి తనదేనంటూ ఓ రైతు కంచె ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయ భూమిని రక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని వీరన్నపేట గ్రామ శివారులోని శివాలయం చుట్టూ ఓ భూ యజమాని ఆలయానికి వెళ్లకుండా అడ్డుగా, దారిలేకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేశాడు. దాంతో గ్రామస్తులు దేవాలయానికి ఎలా వెళ్లాలంటూ ప్రశ్నిస్తున్నారు. గతంలో ఈ భూమి దేవుని ఇనాంగా ఉంటే పట్టాదారు ఓఆర్‌సీ హక్కులు తెచ్చుకుని కబ్జా చేయడంపై పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. రెవెన్యూ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఆలయం వద్ద గుమిగూడిన గ్రామస్తుల



చేవెళ్ల : నిరసనలో పాల్గొన్న నాయకులు

విద్యా వ్యాపారాన్ని అరికట్టాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూన్ 14 : గుర్తింపు లేని కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలను మూసివేయాలని, అధిక ఫీజులను అరికట్టాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శులు ప్రణయ్, బి. శంకర్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావును కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ప్రయివేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నాయన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా జిల్లా పరిధిలో ఎన్నో కాలేజీలు నడుస్తున్నాయని తెలిపారు. సేవా దృక్పథంతో నడవాల్సిన విద్యాసంస్థలు విచ్చల విడిగా ఫీజులు వసూలు చేసి లాభాలే ధ్యేయంగా కొనసాగిస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కుతూ చదువంటే మా విద్యా సంస్థలే అనే విధంగా పత్రికా ప్రకటనలు, మీడియా ద్వారా ప్రచారం చేస్తూ విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్న వారిపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యా సంస్థల వద్ద ప్రత్యక్షంగా ఆందోళనలు చేపడుతామన్నారు. నాయకులు తరంగ్, వంశీ తదితరులున్నారు.

యాచారం : విద్యార్థుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలుతీసుకోవాలని తెలంగాణ జనసమితి ఇబ్రహీంపట్నం డివిజన్ కన్వీనర్ ఎస్.నిరంజన్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ప్రైవేటు పాఠశాలల్లో యూనిఫాం, బుక్స్ పేరిట అడ్డగోలుగా ఫీజులు దండుకుంటున్నారని చెప్పారు.



రంగారెడ్డి అర్బన్ : సుశీందర్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చేవెళ్ల : అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల భరతం పడుతామని ఏబీవీపీ చేవెళ్ల నగర కార్యదర్శి కుర్వ మైపాల్ తెలిపారు. మండల కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎంఈవో అక్బర్‌ను కలిసి అధిక ఫీజు వసూళ్లను నియంత్రించాలని వినతిపత్రం అందించారు. ఏబీవీపీ నాయకులు ప్రశాంత్, ఉదయ్, శివ తదితరులు ఉన్నారు.

'ప్రైవేటు' పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ గీతాన్ని ముద్రించాలి



వినతిపత్రం ఇస్తున్న నరేష్ తదితరులు

మహేశ్వరం, జూన్ 14 : ప్రయివేటు పాఠశాలల్లో పంపిణీ చేస్తున్న పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ రాష్ట్ర గీతం లేదని, వెంటనే రాష్ట్ర గీతంతో ఉన్న పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసేలా కృషి చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర నాయకులు పల్నాటి నరేష్ అన్నారు. ఈమేరకు శుక్రవారం రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావుకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఎంతో మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన తెలంగాణలో విద్యార్థులకు అందించే పాఠ్యపుస్తకాల్లో రాష్ట్ర గీతం లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ముద్రించిన పుస్తకాలనే పంపిణీ చేసేలా చూడాలన్నారు. ఉద్యమకారుల ఫోరమ్ నాయకులు వెంకటేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన భరత్ ప్రసాద్



ఆమనగల్లు, జూన్ 14: కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి ని శుక్రవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు, జడ్పీటీసీ పోతుగంటి భరత్ ప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని శాస్త్రీ భవన్‌లో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కిషన్ రెడ్డిని పూలమాలు, శాలువాలతో సత్కరించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా సాయమందించాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు భరత్ ప్రసాద్ తెలిపారు.

మల్లు రవిని కలిసిన వైస్ ఎంపీపీ అనంతరెడ్డి



మల్లు రవిని సన్మానిస్తున్న అనంత రెడ్డి, జంగయ్య

ఆమనగల్లు, జూన్ 14: నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవిని శుక్రవారం ఆమనగల్లు వైస్ ఎంపీపీ జక్కు అనంత రెడ్డి వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్యలు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఆమనగల్లు మండలాభివృద్ధికి ప్రభుత్వ పరంగా సహకరించాలని మల్లును కోరగా సానుకూలంగా స్పందించినట్లు అనంతరెడ్డి, జంగయ్యలు పేర్కొన్నారు.

మిషన్ భగీరథ నీటి సరఫరాపై ఇంటింటి సర్వే

ఆమనగల్లు, జూన్ 14: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం మిషన్ భగీరథపై ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాలో శుక్రవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. పథకం ప్రారంభమై ఐదేళ్లైన తర్వాత క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో గ్రామాలవారిగా సమస్యలను గుర్తించేందుకు ఇంటింటి సర్వేకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మిషన్ భగీరథ నల్ల కనెక్షన్ ఉందా, ఎన్ని రోజులకోసారి ఏ మేర నీరు వస్తున్నాయని, వచ్చే నీరు మిషన్ భగీరథ నీళ్లా, స్థానిక బోరు బావుల నీళ్లా అనే వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఇంటి యజమాని పేరు, ఫోటో, ఆదార్, సెల్ నెంబర్లతోక లిపి యాప్‌లో నమోదు చేస్తున్నారు. మేడిగడ్డలో పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య ఆధ్వర్యంలో మిషన్ భగీరథ సర్వే చేపట్టారు.

సంక్షిప్తంగా..

ఆమనగల్లు : ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఈనెల 17న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ పీఆర్‌వో ఎంఏ పాష తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఆమనగల్లు లయన్స్‌క్లబ్, ఎనుగొండ రాంరెడ్డి లయన్స్‌కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆమనగల్లు : ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎంగళి ప్రసాద్ జన్మదిన వేడుకలు ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులతో కలిసి ప్రసాద్ కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఎంపీపీ అనితవిజయ్, నాయకులు కృష్ణనాయక్, అలీం, పులికంటి మైసయ్య, కరీం, ఫరీద్, మహే శ్, అయోధ్య, కుమార్ గౌడ్, నాజర్, గౌస్, అంజద్, మహేశ్, జావేద్ తదితరులున్నారు.

యాచారం : మారుమూల గ్రామాలలో ప్రజలకు సేవలందిస్తున్న ఆర్‌ఎంపీలకు రక్షణ కల్పించాలని కోరుతూ ఈనెల 19న బంద్ నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా ఆర్‌ఎంపీల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. 19న ఉదయం ఎల్‌బీనగర్ చౌరస్తా నుంచి రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ కోఠి వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపింది.

కేశంపేట : నిర్దవెల్లిలోని దళితవాడలో కాంగ్రెస్ నాయకులు బోరు మోటారు ప్రారంభించారు. దళితవాడలో తాగు నీటి సమస్య ఉందని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్ గౌడ్ స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే నిధులు విడుదల చేయించారు. వెంటనే బోరు మోటారు బిగించి ప్రారంభించారు. కాలనీ వాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి బద్రప్ప, నాయకులు వెంకట్ రెడ్డి, జంగయ్య, బడక మల్లయ్య, ముత్యాలు, చంద్రయ్య, రాజేందర్, అమేర్, రామకృష్ణ, జంగేశ్, జానకి రాములు తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి : విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని కొండకల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవనజ్యోతి తెలిపారు. నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన 6గురు విద్యార్థులను కొండాకల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు అభినందించారు.

శంకర్‌పల్లి : పారిశుధ్య కార్మికులు చేసే సేవను ప్రతి ఒక్కరూ గుర్తించాలని శంకర్‌పల్లి మున్సిపల్ ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు కమిషనర్ శ్రీనివాస్‌తో కలిసి నూనెలు, సబ్బులు, యాప్రాన్లు, రేడియం జాకెట్లు, బూట్లు తదితర వాటిని అందజేశారు.

కేశంపేట : రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని కేశంపేట మండల బీజేపీ నాయకులు శుక్రవారం కేశంపేట మండల వ్యవసాయధికారి శిరీషకు వినతి పత్రం అందించారు. డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలు కట్టబెడుతున్నారని వివరించారు.

ఆమనగల్లు : విత్తన, ఎరువుల డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు లోబడి నడుచుకోవాలని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో ఎరువుల దుకాణాలలో రికార్డులను, విత్తనాలబస్తాలను, ఎరువుల నిల్వలు పరిశీలించారు. విత్తనాల నమూనాలను సేకరించారు.

యాచారం : మండల తహసీల్దార్ అయ్యప్పను మూసీ రివర్ ప్రాజెక్టుకు డిప్యూటేషన్ చేస్తూ శుక్రవారం సాయంత్రం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. లోక్‌సభ ఎన్నికల ముందు నగరం నుంచి బదిలీపై వచ్చారు. మండలంలోని రైతులు భూసమస్యలను పరిష్కరించడంతో కీలకంగా వ్యవహరించారు.